భూసార పరీక్ష.. పంటకు శ్రీరామరక్ష

మట్టి నమూనాల సేకరణలో మారిన విధానం

పామర్రు: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి 90 శాతం మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంటల సాగు చేపడుతున్నారు. అధిక దిగుబడులు రావాలని రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చు పెరగడం తప్ప దిగుబడుల్లో మార్పు ఉండటం లేదు. అంతే కాక వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

జీపీఎస్ విధానంతో మట్టి సేకరణ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో అమలు చేస్తూ రైతులు మెరుగైన దిగుబడులు సాధించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా వ్యవసాయ శాఖ అధికారులు ముందుకు పోతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాలను గుర్తించి పంటల సాగు చేపట్టేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందుకోసం జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ద్వారా మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లనే భూమిలోని పోషకాలు నశించి పోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. ఫలితంగా జింకు లోపంతో మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు హైడ్రోజన్, సేంద్రియ కర్బనాల స్థాయి కూడా చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.75 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.



పామర్రులో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మూడేళ్లకోసారి తప్పనిసరి

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలల్లో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి, నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తోంది. దీంతో దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. భూమిలో లోపించిన లవణాలను గుర్తించి, దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకు ఒక సారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మట్టి సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొలంలో ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు, నీరు పెట్టిన తర్వాత నీడ పడే ప్రదేశాలు, ఎరువులు కుప్పలు, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు.
- పంటకోత తర్వాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలంలో త్రిభుజాకారంలో 15-20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పై పార నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- పొలం మొత్తంగా 8-10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగాలు మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అర కిలో వచ్చే వరకు చేస్తూ ఉండాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డి వేర్లను వేరు చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగ్‌లో గాని పాలిథిన్ కవర్‌లోగాని నింపి రైతు వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.

మట్టి సేకరణకు స్థానిక ఎంపీఈఓల సాయం తీసుకుంటే, వారు రైతు పొలం వద్ద జీపీఎస్ నమోదు చేసి నమూనాలను సేకరించి పంపుతారు.

అవగాహన కల్పిస్తున్నాం

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు ఉంటాయి. ఏటా భూసార పరీక్షలు చేసి మండలంలో రైతులకు కార్డులు అందజేస్తున్నాం. ఈ ఏడాది కూడా భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుంది.

–శివనాగరాణి, ఏఓ, పామర్రు

పంట కాలువలో పూడికతీత



మండవల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పలువురికి మేలు కలుగుతుందని ఎంపీడీఓ ఎన్ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని కానుకొల్లులో రూ.67 వేల ఉపాధి నిధులతో 43 మంది ఉపాధి కూలీలు సోమవారం పంట కాలువలో పూడికతీత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంట కాలువలు బాగు చేయడం వల్ల పొలాలకు వేగవంతంగా నీరందుతుందని, చెరువులు నిండి ప్రజలకు దాహార్తి నివారణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లో పోస్టాఫీస్

మండవల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మండవల్లిలోని పోస్టాఫీస్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదులతో ఉన్న ఈ భవనంలో సిబ్బందితోపాటు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సెంటర్‌లో సుమారు 20 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీ తాగు చెరువు గట్టు పక్కన పోస్టాఫీస్‌కు 10 సెంట్ల స్థలం కేటాయించింది. అక్కడ ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం ప్రారంభించలేదు. కిలోమీటరు దూరంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్‌కు వెళ్లేందుకు వృద్ధులు, వికలాంగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టాఫీస్‌కు కేటాయించిన స్థలంలో భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

కేంద్రమంత్రికి బీజేపీ నాయకుడి అభినందనలు



గుడివాడరూరల్: కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నర్సాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను సోమవారం ఢిల్లీలోని ఆయన స్వగృహంలో గుడివాడకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు రామినేని వెంకటకృష్ణ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామినేని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నర్సాపురం ఎంపీ భూపతిరాజును కేంద్రమంత్రిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని రామినేని తెలిపారు.

ఆర్యవైశ్య కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, రఘుబాబు



గుడివాడరూరల్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కమిటీ సభ్యులుగా పట్టణానికి చెందిన తాడిపర్తి శ్రీనివాస్, జిల్లా రఘుబాబు నియమితులయ్యారు. స్థానిక ఆర్యవైశ్య కార్యాలయంలో సోమవారం వీరికి వైశ్య ప్రముఖుడు యెక్కలి మణిదీప్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ్‌సత్యనారాయణ నియామకపత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశ్యుల అభివృద్ధికి నూతనంగా నియమితులైన సభ్యులు కృషి చేయాలన్నారు. సంఘీయుల కష్ట,సుఖాల్లో తోడుగా ఉండాలని కోరారు. అనంతరం పలువురు సంఘీయులు నూతనంగా సభ్యులుగా నియమితులైన వారిని ఘనంగా సత్కరించి అభినందించారు.

అన్నసమారాధన



గుడివాడరూరల్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ సరపల్లి శ్రీనివాస రెడ్డి, అపర్ణల కుమార్తె మీనాక్షిప్రియారెడ్డి 8వ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, మాకుల సత్యం, సభ్యులు కంతేటి హరిబాబు, జాజుల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల మండలానికి విద్యా కిట్లు



ఘంటసాల: విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేసేందుకు కసరత్తు జరుగుతోందని ఎంఈఓ2 ఎండీ మోమిన్ అన్నారు. ఘంటసాల మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా కానుక కిట్లు సోమవారం ఘంటసాల చేరుకున్నాయి. ఆయా కిట్లను సీఆర్పీలు, సిబ్బందితో ఎంఈఓ2 మోమిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల మండలంలోని వివిధ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 1879 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వారికి సంబంధించి నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, దుస్తులు వచ్చాయని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఉంగుటూరు: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ మేనేజర్ జి.పద్మవల్లి తెలిపారు. తేలప్రోలు ఎస్‌బీఐ వద్ద పలువురు ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ మోసాలు, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కేవైసీ అప్‌డేట్, సీవీవీ, పిన్ నంబరు కోసం బ్యాంకు సిబ్బంది ఎవరినీ అడగరని చెప్పారు. బ్యాంకు ఖాతాకు సంబంధించిన సమాచారాన్ని ఎవరితో పంచుకోకూడదన్నారు. ఒక వేళ మీరు ఎటువంటి లావాదేవీలు చేయకపోయినా లావాదేవీలు జరిగినట్లు అనుమానం వస్తే తక్షణమే బ్యాంకులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసోసియేట్ పి.శాంతికిరణ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ సలహామండలి అధ్యక్ష పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఏఓకు అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

పామర్రు: పామర్రు మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్ష పదవికి ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి సోమవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ శివనాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేశానని తెలిపారు. తన రాజీనామాను జిల్లా వ్యవసాయ అధికారులు ఆమోదించవలసిందిగా కోరారు.

ముస్లిం సంచార కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



సయ్యద్

గుడివాడరూరల్: ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో పట్టణానికి చెందిన ముస్లిం సంచార కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేశానని తెలిపారు. రాజీనామాను బీసీ కార్పొరేషన్ కార్యదర్శికి మెయిల్ ద్వారా పంపానని ఆయన పేర్కొన్నారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి



కంకిపాడులో మాట్లాడుతున్న మాలమహానాడు సంఘం నాయకులు

కంకిపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన సంఘటనపై సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోగులమూడి రాజు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం లాకులు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు అసభ్యంగా దూషిస్తూ లేఖ రాసి, చెప్పులు దండ వేయటాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల ముసుగులో రాజ్యాంగ నిర్మాతనే అవమానిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి, మాలలను దూషిస్తూ లేఖ రాసిన నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గంజి రాజ్ కుమార్, గన్నవరం, పెనమలూరు నియోజక వర్గాల అధ్యక్షులు సరిహద్దు ఆంటోని, పి.రామకృష్ణ, నాయకులు రాపల్లి విల్సన్, మారుమూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తిప్రదాత రాజరత్నం

గజల్ శ్రీనివాస్



రాజరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్

ఘంటసాల: అన్నదానంలో పరమాత్ముడు ఉన్నాడని నమ్మిన వ్యక్తి రాజరత్నం మహిళలకు స్ఫూర్తి ప్రదాతని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ఘంటసాల గ్రామానికి చెందిన మూల్పూరి రాధాకృష్ణయ్య సతీమణి రాజరత్నం ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆయన ఆత్మీయ స్నేహితుడైన రాజరత్నం కుమారుడు ప్రవాస భారతీయుడు మూల్పూరి రత్నశేఖర్‌ను, వారి సోదరుడు సతీష్‌లను ఘంటసాల గ్రామంలోని వారి స్వగృహంలో సోమవారం పరామర్శించారు. రాజరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఘంటసాలలోని జలధీశ్వరస్వామి వారికి సుప్రభాతం అంకితం ఇవ్వడానికి వచ్చినప్పుడు భోజనం పెట్టారని, ఆమె భక్తి గీతాలు ఆలపించగా తన్మయత్వం చెందారన్నారు.ఆమె శివైక్యం చెందడం బాధాకరమన్నారు. రోజూ పది మందికి అన్నం పెట్టాలని, అన్నంమే శ్రీహరి అని, అన్నదానంలోనే పరమాత్మ ఉన్నాడని నమ్మిన వ్యక్తని కొనియాడారు. ఘంటసా ప్రాచీన పట్టణమని, ఎంతో మంది మహనీయులు, రాజులు, ఋషులు, బౌద్ధ భిక్షవులు నడయాడిన పుణ్యభూమిలో సుప్రభాతం చేయడం అదృష్టం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు



మొవ్వ: సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల ఆదేశాల మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు కోసం చేసిన డోర్ టూ డోర్ సర్వేలో 13 మందిని గుర్తించినట్లు ఐఈఆర్పీలు తెలిపారు. గత నెల ఒకటో తేదీ నుంచి జరిగిన ఈ సర్వే ద్వారా నర్సన్నపాలెంలో-2, కూచిపూడిలో -3, మల్లికార్జునపురంలో-3, మొవ్వలో-2, వేములమడ, మందపాలెం, పెద ముత్తేవి గ్రామాల్లో ఒక్కొక్క ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించినట్లు ఐఈఆర్పీలు వాణి శ్రీ, సాయిశ్రీ తెలిపారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామి ప్రత్యేక పూజల్లో ఉప్పాల రాము

బంటుమిల్లి: మండలంలోని చినతుమ్మిడి గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవ పూజల్లో పెడన నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము)పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం వార్షికోత్సవం సందర్భంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, అఖండ దీపారాధన, స్వామి వార్కి ట్రస్టీ వెలివెల సత్యనారాయణ, మీనాక్షి దంపతులతోపాటు పలువురు విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు హనుమాన్‌చాలీసా పారాయణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, వైఎస్సార్ సీపీ నాయకులు బి.నాగార్జున, పి.శివ, రాంకీ, జీవీ రాజు, కె.వెంకటేశ్వరరావు, డి.సాంబశివరావు, మాజీ సర్పంచ్ పి.నరసింహారావు, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటాం



వైఎస్సార్ సీపీ అభిమానులతో డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. ఏలూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. డీఎన్నార్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు వెలువడిన అనంతరం చోటు చేసుకున్న ఘటనలు తదితర అంశాలపై ఆయన చర్చించారు. నియోజకవర్గంలో ప్రజలందరికీ పార్టీలు చూడకుండా, అవినీతికి చోటులేకుండా అనేక సంక్షేమ పథకాలు అందించామని, ఎన్నికల్లో జయాపజయాలు సహజమని నియోజకవర్గంలో కార్యకర్తలను ఇబ్బంది పెడితే వారి తరపున పోరాటాలకైనా సిద్ధమన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి మద్దతు కోరుతామన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలిగినా నాయకులంతా అండగా ఉంటామన్నారు.

వైభవంగా రాజగోపాలస్వామికి శాంతి కల్యాణం



రాజగోపాలస్వామి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మండవల్లి: అల్లినగరం రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఈఓ దివ్యశ్రీ పర్యవేక్షణలో నారగాని నాగేశ్వరరావు దంపతులతో కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రాము, సాంబశివరావు, శివాజీ పాల్గొన్నారు.


ఘనంగా కోదండరామయ్య విగ్రహావిష్కరణ



కోదండరామయ్య కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న రామచంద్రమ్మ, అతిథులు

గన్నవరం: గన్నవరం పరిసర ప్రాంతాల్లో విద్యారంగం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వీకేఆర్ కళాశాల వ్యవస్థాపకుడు వేములపల్లి కోదండరామయ్య ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో సోమవారం వేములపల్లి కోదండరామయ్య 110వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోదండరామయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన మేనకోడలు మోటపర్తి రామచంద్రమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. తొలుత జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం రామచంద్రమ్మ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జీవితమంతా పాటుపడిన గొప్ప మహోన్నతమైన వ్యక్తిగా కోదండరామయ్యను అభివర్ణించారు. బుద్ధవరం, గుడివాడలో కళాశాలలు, నందివాడ, గన్నవరంలో జెడ్పీ హైస్కూల్స్ ఏర్పాటు ద్వారా వేలాది మంది విద్యార్థుల ఉన్నతికి ఆయన తోడ్పాడ్డారని చెప్పారు. ఐదున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన వీఆర్ కళాశాల విద్యార్థినని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నట్లు ఎమ్మెల్యే గద్దె పేర్కొన్నారు. పామర్రు ఎమ్మెల్యేగా ఎన్నికైన వర్ల కుమార్‌రాజా, కళాశాల కార్యదర్శి జీఎల్ఎస్ఎన్ ప్రసాద్, కరస్పాండెంట్ పీవీ రత్నప్రసాద్, కోశాధికారి గూడవల్లి రాధాసుబ్బారావు, మాజీ కార్యదర్శి చింతపల్లి సీతారామయ్య, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



కోడూరు: స్థానిక కోట రాఘవయ్య (ఎస్‌కేఆర్) విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యాసంస్థల పర్యవేక్షణలో కొనసాగుతున్న రవితేజ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఈ హోమాన్ని జరిపారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ విద్యాసంస్థల గౌరవసలహాదారు కోట వెంకట సుబ్బారావు, పాఠశాల డైరెక్టర్ వల్లభనేని వీరవెంకట శివవరప్రసాద్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి హోమక్రతువును జరిపారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ పూజలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వెంకటసుబ్బారావు, శివవరప్రసాద్ సూచించారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పేదలకు అండగా 'సహాయ'



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

పెడన: పేద కుటుంబాలను పలు రాకల సేవలతో అండదండగా సహాయ ఫౌండేషన్ నిలుస్తోందని విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణ మూర్తి అన్నారు. సోమవారం స్థానికంగా సంస్థ కార్యాలయంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఫౌండేషన్ ప్రతినిధులు కొన్ని సంవత్సరాలుగా పేదలను ఆర్థిక, వస్తు రూపేణ ఆదుకుంటున్నారు. వేసవిలో పేద విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, ప్రతిభ అవార్డ్స్ అందచేసి ప్రోత్సహిస్తోందన్నారు. వారికి సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వడాన్ని ఆయన కొనియాడారు. ఇందులో భాగంగా సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌బాషా, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాదు, సభ్యులు ఆర్. ప్రసాదు, కె.సాంబశివరావు, మహిళ విభాగం అధ్యక్షురాలు కె.వెంకటేశ్వరమ్మ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు సత్యనారాయణను సత్కరించారు.

నోరూరిస్తున్న నేరేడు కాయలు



పామర్రు: రహదారి వెంబడి నల్లని రంగులో ఉన్న నేరేడు కాయలు నోరూరిస్తున్నాయి. సోమవారం స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద నేరేడు కాయలను తోపుడు బండిలో విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో వచ్చే నేరేడు కాయలను ఎంతో మంది ఇష్టంగా తింటూ ఉంటారు. కేజీ నేరేడు కాయలు రూ.250 నుంచి రూ.300 వరకు అమ్ముతుండటంతో ప్రజలు ఆ రేటును చూసి వామ్మో అంత ధరా అని ఆశ్చర్యపోతున్నారు.